ఆలోచన రేకెత్తించే 'అడల్ట్స్ ఓన్లీ' కథ

పెన్మెత్స శ్రీకాంత్ రాజు

# ఆ చప్పుడు...

'కిర్ర్..ర్ర్..ర్ర్...'

ఆ ఇంటి పెరటి వైపు తలుపు తెరిస్తే సన్నగా వచ్చే ఆ ప్రత్యేక శబ్దానికి రాఘవయ్యగారికి మెలకువ వచ్చింది.

అసహనంగా ప్రక్క మీద కదిలాడాయన.

ఆ చప్పుడు ఆయనకు చెవుల్లో ఎలుకలు దూరినంత కంపరాన్ని కలిగిస్తోంది.

ఏదో తెలియని కోపం. ఎవరి మీదో అక్కసు! చాలా అస్థిమితంగా అన్పించసాగింది ఆయనకు.

అది నిద్రలో మెలకువ వస్తే కలిగేలాంటి చిరాకు కాదు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో పెరటి తలుపెవరు తీసారన్న విసుగు కూడా కాదు.

ఆ తలుపు ఎవరు తీసారో...ఎందుకు తీసారో కూడా ఆయనకు తెలుసు!

☆ ☆ ☆

రాఘవయ్యగారు ఓ ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తూ వుండేవారు. ఆయన భార్య కామాక్షి, ఒక్కగానొక్క కొడుకు పవన్.. ఇదీ వారి కుటుంబ నేపథ్యం.

పవన్ బాగా చదువుకుని బెంగుళూరులో ఏదో ఫ్యాక్టరీలో మంచి ఉద్యోగం సంపాదించాడు. రాఘవయ్య, కామాక్షి దంపతులు ఆంధ్ర దేశాన్నంతా జల్లెడపట్టి వెతికి ఏరి కోరి చక్కని చుక్కలాంటి కమలని కోడలిగా చేసుకున్నారు.

కమల సంవత్సరం తిరక్కుండానే ఇద్దరు కవల మగపిల్లల్ని కని రాఘవయ్యగార్ని తాతయ్యను చేసింది.

అలా పదేళ్ళు గడిచిపోయాయి.

రోజులు అలా దొర్లిపోతుండగా వారి జీవితాల్లో ఓ పెను విషాదం సంభవించింది. పవన్ తన ఫ్యాక్టరీలో జరిగిన ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కొడుకు మరణవార్త వినగానే కామాక్షికి స్పృహ తప్పిపోయింది. ఆ స్పృహ మళ్లీ రాలేదు. ఆ షాక్‌తో చనిపోయిందామె. ఓ పక్క కొడుకు మరో పక్క భార్య... ఇద్దరి మృతితో రాఘవయ్యగారు దాదాపు పిచ్చివాడైపోయాడు.

అలాంటి దుఃఖాన్ని దిగమింగుకుని ఆయన మామూలయ్యారంటే అందుక్కారణం ఆయన మనవలు..కోడలూను!

కమలకు పుట్టింటి అండ లేదు. ఆమె పెద్దగా చదువుకోనూ లేదు. మనవల్ని కోడల్ని దిక్కులేని వాళ్లని చేయలేక మనసు రాయి చేసుకుని బతుకుతున్నాడాయన.

ఇదంతా జరిగి రెండేళ్లవుతోంది. భర్త పోయిన తర్వాత కమల మామగారింటికి తన ఇద్దరు పిల్లలతో చేరింది. ప్రస్తుతం పిల్లలిద్దరూ హైస్కూలులో ఆరవ తరగతి చదువుతున్నారు.

"నీ పిల్లలు చదువులు పూర్తయ్యేదాకా ఈ ప్రాణాలు నిలబెట్టుకుంటాను. వాళ్లకి రెక్కలొచ్చాక నిన్ను వాళ్ల చేతుల్లో పెట్టిగాని పోను..." తరచూ కోడలికి ధైర్యం చెబుతుంటాడాయన.

రాఘవయ్యగార్కి కోడలంటే చాలా అభిమానం. చిన్న వయసులో ఆమెకొచ్చిన కష్టం ఆయన్ని కలిచివేస్తుంటుంది.


కానీ ఈమధ్య ఆయనకు కోడలి పొడ అస్సలు గిట్టడం లేదు. ఆమెతో చాలా ముక్తసరిగా మాట్లాడుతున్నాడు. ఆమె ముఖం చూస్తే ఆయనకు కంపరం కలుగుతోంది. ఆవేశంతో రక్తం మరిగిపోతోంది.

అసలేం జరిగిందంటే...

☆ ☆ ☆

రాఘవయ్యగారికి నిద్ర రావటం లేదు.

రాత్రి అర్ధరాత్రికి చేరువైనట్టు సూచిస్తోంది. ఏవేవో జ్ఞాపకాలు మనసుని పిండేస్తుంటే నిద్రరాని కళ్లని మూసుకున్నారాయన.



ఇంతలో 'కిర్ర్...ర్..ర్' పెరటి తలుపు తెరుస్తున్న చప్పుడు.

కోడలెందుకో లేచిందనుకున్నారాయన. నిద్రపోవటానికి ప్రయత్నించసాగారు.

పది నిమిషాలు గడిచాయి.

పావు గంట గడిచింది.

అయినా తలుపు తిరిగి వేసిన చప్పుడు వినిపించలేదు.

ఇక మంచం మీదుండలేక లేచారు. పెరట్లోకెళ్లారు. అక్కడ కమల లేదు. ఆయనకు ఒక్కసారి భయం వేసింది.

"కమలా..." అంటూ గట్టిగా అరవబోయి ఆగిపోయారు ఏదో చిన్న చప్పుడు విని. పాత సామాన్లు వేసుకునే చిన్న రేకుల షెడ్డులోంచి వస్తోందా చప్పుడు.

ఆయన మనసు కీడు శంకిస్తోంటే అడుగులో అడుగేస్తూ అక్కడికి చేరాడు.



ఆ రోజు నిండు పున్నమి కావడంతో... గ్రిల్‌లోంచి వెన్నెల ఆ గదిలోకి పడుతోంది. గ్రిల్‌కి ఎదురుగా ఉన్న కిటికీలోంచి లోపలికి చూసేడు రాఘవయ్య.

వెన్నెల వెలుగులో ఓ జంట సర్వం మరచి ఒకరినొకరు పెనవేసుకుపోయి వున్నారు.

ఆమె గోధుమ త్రాచులా వుంటే, ఆమెని చుట్టేసిన నల్లత్రాచులా అతను!

వారి ఊపిరి నిజంగా పాముబుసలాగే వుంది.

కమల, పక్కింటి బ్రహ్మచారి సుందర్రావు.

నెత్తిమీద సమ్మెటతో మోదినట్టు మెదడు మొద్దుబారిపోతుంటే సభ్యత వెన్నుతట్టగా వెనక్కి చీకట్లోకి నడిచి, ఓరగా తెరచి వున్న పెరటి తలుపు వెనక నిలబడ్డాడు రాఘవయ్య.

కాసేపటికి ఆ గదిలోంచి బయటకు వచ్చింది కమల దుస్తులు సర్దుకుంటూ, రేగిన జుట్టు నవరించుకుంటూ. ఆ వెనుకే లుంగీ కట్టుకుంటూ సుందర్రావు.

నవనాడులు కృంగిపోతుండగా ఎలా వెళ్లి మంచం మీద వాలాడో రాఘవయ్యకే తెలీదు.

'కులట! కూతురి కంటే ఎక్కువగా చూస్తుంటే ఎంత నైచ్యానికి దిగజారింది. సిగ్గనేది అవగింజంతైనా లేకుండా... ఇద్దరు పిల్లల తల్లయింది. ట్యూబెక్టమీ ఆపరేషనైంది. పదేళ్లు కాపురం చేసింది. పిల్లలకి ఎంత తలవంపులన్న జ్ఞానం కూడా లేకుండా... ఎంతకు బరితెగించింది..!

ఆ సుందర్రావు వెధవకైనా బుద్ధుండక్కర్లేదూ! నలభై ఏళ్లొచ్చినా అక్కలకి చెల్లెళ్లకి పెళ్ళిళ్ళు చెయ్యడు. తనూ చేసుకోడు. ఇలా చిత్తకార్తె కుక్కలా గోడలు దూకుతున్నాడు.

అయినా ఆ బ్రహ్మచారి వెధవ తప్పేం వుంది? మగాడు! ఆడది ఈ కమలకి బుద్ధుండక్కర్లేదూ! చిన్న వయసులో భర్తను పోగొట్టుకుందని, ఏదో వానాకాలం చదువు చదివిందని, పుట్టింటి దక్షత లేనిదని, నా గుండె రాయి చేసుకుని, పోయిన భార్య, కొడుకూ ప్రతి నిమిషమూ గుర్తుకొస్తున్నా ఆమె కోసం ఆమె పిల్లల కోసం నేను బ్రతుకుతుంటే... ఇంత తలవంపులు తెచ్చే పని చేస్తుందా?' రాఘవయ్య మనసు కోపంతో రగిలిపోసాగింది.

ఆ నడిరాత్రి కోడలి చెంపలు పగుల కొట్టి ఇంట్లోంచి బయటకు తోద్దామన్నంత కోపం వచ్చింది. విజ్ఞుడవటం వలన తమాయించుకున్నాడు.

☆☆☆

వారానికి ఒకటి రెండు సార్లు అర్ధరాత్రి ఆ తలుపు తెరుచుకోవడం కమల సుందర్రావుని కలిసి రావటం రాఘవయ్యకు తెలుస్తూనే వుంది. ఆ కాసేపు అతను ఆవేశంతో రగిలిపోతుంటాడు. తెల్లవారితే ఆవేశం కాస్త చల్లబడుతోంది.

కోడలిపై ఏ చర్య తీసుకోవాలన్నది అతను తేల్చుకోలేకపోతున్నాడు. కోడలిని పొమ్మంటే ఆ మనవల బాధ్యత ఆయన తీసుకోవాలి! ఈ వయసులో అది ఆయన వల్లకాదు.

మనసులో బడబానలాన్ని దాచుకుని రాఘవరావు మౌనంగా ఉండసాగాడు. మామగారి మౌనానికి కారణాన్ని గ్రహించని కమల ఎప్పటిలాగే వుంటోంది.

☆☆☆

"అరె! రత్నాకర్‌రావు...నువ్వా ఎన్నాళ్లకెన్నాళ్లకు..." రాఘవయ్య అన్నాడు సంతోషంతో తన ప్రాణ స్నేహితుణ్ణి ఆలింగనం చేసుకుంటూ.

స్నేహితుడి భుజాల చుట్టూ చేతులు వేసి "తెలిసింది..కామాక్షి సంగతి, పవన్ సంగతి! అమెరికా నుంచి రావటం వీలుపడలేదు. వచ్చిన వెంటనే ఇదిగో ఇలా నీ దగ్గరికే వచ్చేసాను. నీకు రాకూడని కష్టమే వచ్చింది" బాధగా అన్నాడు రత్నాకర్‌రావు.

## గ్లామరస్ షీలా

ఇటీవల విడుదలైన 'మస్కా' సినిమాలో గ్లామరస్‌గా కనిపించిన షీలాకి ఇలాంటి తరహా పాత్రల పైనే ఎక్కువగా ఇంటరెస్ట్ వుందిట. కమర్షియల్‌గా హిట్టవాలంటే గ్లామరస్‌గానే వుండాలి కదా! అయితే ఆమె మొదటి నుంచీ నటనకు అవకాశం వుండే పాత్రలే వస్తుండడంతో వాటిని ఒప్పుకుని చేసిన షీలా ఇప్పటికి 'మస్కా'తో సరికొత్తగా దర్శనమిచ్చింది. ఇకపై తమిళంలో కూడా గ్లామర్ పాత్రలే ఎక్కువగా వేయాలనుకుంటోందిట.

కంట్లో ఊరుతున్న నీటిని రెప్పలు తాటించి అదుపు చేసుకోవటానికి ప్రయత్నిస్తూ మిత్రుని యోగక్షేమాలు కనుక్కున్నాడు రాఘవయ్య.

కమల ఇచ్చిన టీలు తాగేక ఇద్దరూ పార్కుకి వెళ్లారు.

ఎన్నాళ్లుగానో మాట్లాడే అవకాశం దొరక్క మూగ వాడిగా వుండిపోయిన రాఘవయ్య తన స్నేహితుడితో కరువుదీరా మాట్లాడసాగాడు.

"చనిపోవాలని వుంది రత్నాకర్! కేవలం మనవలని దిక్కులేని వాళ్లను చేయడం ఇష్టంలేక బ్రతుకుతున్నాను. భార్య, కొడుకూ పోయి పుట్టెడు దుఃఖంతో ఇంకా జీవిస్తున్నానంటే కేవలం అందుకే..." రాఘవయ్య గొంతు గద్గదమైంది.

"నీ వ్యధ అర్ధం చేసుకోగలను. కానీ పోయిన వాళ్లతో పోతామా చెప్పు! మనసు దిటవు చేసుకోవాలి. మన టైము వచ్చినప్పుడు మనమూ వెళ్లిపోక వుండిపోతామా...సరే ఈ మూడ్ లోంచి బయటకు రా... ట్రైన్‌లో పంకజం కనిపించింది" టాపిక్ డైవర్ట్ చేస్తూ అన్నాడు రత్నాకర్‌రావు.

"పంకజం కనిపించిందా?" ఆశ్చర్యంగా అడిగాడు రాఘవయ్య.

"అవును.." అన్నాడు రత్నాకర్ రావు, రాఘవయ్య కళ్లలోకి కొంటెగా చూస్తూ. ఇద్దరి మనసులు గతంలోకి జారాయి.

☆ ☆ ☆

పంకజం పేరు చెపితే ఆ ఊరి కుర్రకారుకి గుండె లయ తప్పేది. ఆమె దృష్టిలో పడదానికి ప్రయత్నించని మగాడే లేడు. అలా ప్రయత్నించే వాళ్లలో రాఘవ్ కూడా ఒకడు.


ఆమె మెప్పు పొందటానికి చీపురుపుల్లలా వుండే ఈ రాఘవయ్యే గుడ్డు, పాలు, పల్లీరసాలు లాంటి బలవర్ధక ఆహారం తీసుకోవడమే కాక పది కిలోమీటర్ల దూరంలో వున్న పట్నం ప్రతిరోజూ వెళ్లి అక్కడి మారుతి వ్యాయామ కళాశాలలో వ్యాయామం చేసి కండలు పెంచేడు.

గడ్డం గరుకెక్కక ముందే మీసం పూర్తి నలుపు రంగు సంతరించుకోక ముందే అతనికి పంకజం కటాక్షం దొరికింది.

ఊళ్లో మగాళ్లందరూ రాఘవయ్య అదృష్టాన్ని అసూయగా చెప్పుకున్నారు.

చాలామంది పంకజమే రాఘవయ్యని వుంచుకుందని అంటుండేవారు.

తోటి కుర్రాళ్లకు రాఘవ్ హీరో అయిపోయాడు. అతను చెప్పే అనుభవాలను వేడివేడి అనుభూతులను వినదానికి అతని స్నేహితులు చెవి కోసుకునేవారు. అలాంటి వాళ్లల్లో రత్నాకర్ రావు ఒకడు.






పెదరెడ్డిగారి పాలేరు పెళ్లాం మంగ రాఘవ్ గురించి విని వుంది. పంకజం అంతటి జాణను ఆకట్టుకున్న రాఘవ్ ఏపాటి మగాడో చూద్దామని పంపుషెడ్‌లోకి పిలిచింది. ఆ సంగతి తెలిసిన కుళ్లుబోతు స్నేహితుడొకడు పంకజానికి ఉప్పందించాడు.

పంకజం మండిపడి పరిగెత్తుకువచ్చి రేకుల షెడ్‌లో కులుకుతున్న మంగని రాఘవ్‌ని బయటకీడ్చి ఆ మంగని జుట్టు వంచి వీపు మీద నాలుగు గుద్దులు గుద్దింది. ఇద్దరూ ఘోరంగా కబడ్డీ ఆడుకుంటుంటే రాఘవయ్య హడలిపోయి అక్కడ్నించి పారిపోయాడు.

రాఘవయ్య పెళ్లయి, కొడుకు పుట్టి ఉద్యోగం వచ్చేదాకా ఆ ఎఫైర్ కొనసాగింది.

☆ ☆ ☆


"పంకజానికి వయసు పెరిగిందే కానీ మాట తీరు మారలేదు. నిన్ను పదే పదే తలుచుకుంది. ఇప్పుడు కూతురి దగ్గర విజయవాడలో వుంటోందట" అన్నాడు రత్నాకర్ రావు.

రాఘవయ్య ముఖంలోకి పంకజం తాలూకు ఆలోచనలతో కొంత కాంతి ప్రవేశించింది. అతను అప్పటి సంగతుల్ని నెమరేసుకుంటున్నాడన్న సంగతి అతని ముఖకవళికలను బట్టీ రత్నాకర్ రావుకు అర్ధమైంది.

కాసేపు పిచ్చాపాటి కబుర్లయ్యాక-

## శ్రియ ఆదర్శం

బాలీవుడ్ భామ సుస్మితాసేన్ ఓ అమ్మాయిని దత్తత తీసుకుని తన కూతురిలాగే ఆమెను పెంచుతూ విద్యాబుద్ధులు నేర్పిస్తోందనే సంగతి తరచూ వార్తల్లో చూస్తూనే ఉంటారు కదా! ఇప్పుడలాగే మరో తార శ్రియ కూడా ఇద్దరు పిల్లల్ని దత్తత తీసుకుంటోందిట. వారి చదువుకు, తిండికీ ఇతర ఖర్చులకు కావలసిన డబ్బును తనే పంపిస్తుందిట ఆ అనాథాశ్రమానికి. తారల్లో ఇలాంటి సామాజిక స్పృహ వుండడం అభినందించదగిన విషయం! మరికొంత తారలు కూడా ఇలాంటి సహాయాలు చేస్తే కొంతమంది అనాథల భవిష్యత్తు బంగారుబాటన పయనిస్తుంది కదా!




"నీ మనవలేం చదువుతున్నారన్నావు?" అడిగాడు రత్నాకరరావు.

"ఆరవ తరగతి"

"ఇంకేం ఓ పదేళ్లు గడిస్తే వాళ్లకు రెక్కలొచ్చేస్తాయి. ఎటొచ్చీ పాపం నీ కోడలు కమలకే! భర్త తోడుండాల్సిన వయసులో ఇంత కష్టం వచ్చింది.." సానుభూతిగా అన్నాడు రత్నాకరరావు.

"ఆ...అంత సానుభూతి ఒలకబొయ్యనవసరం లేదు" చిరాగ్గా అన్నాడు రాఘవయ్య.

"అదేం...?"

ఓ క్షణం తటపటాయించి జరిగినదంతా చెప్పేడు రాఘవయ్య మిత్రునితో...పక్కింటి పెళ్లికాని నడివయసు వ్యక్తితో తన కోడలు నడుపుతున్న అక్రమసంబంధాన్ని!

"నాకు కమల అంటే అసహ్యం వేస్తోంది. నా కొడుకుతో ఎంతో అన్యోన్యంగా వుండేది. వాడు చనిపోయినప్పుడు పిచ్చిదైపోతుందేమో అనుకునేవాణ్ణి. అంత బాధపడింది. ఇప్పటికీ బాధపడుతున్నట్టే వుంటుంది. అదంతా నటన అని నాకీమధ్య అర్థం అయింది. అసలు ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో అర్థం కావడంలేదు" దిగులుగా అన్నాడు రాఘవయ్య.


కాసేపు ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

"చూడు రాఘవయ్యా! కమలకి చనిపోయిన తన భర్త మీద ప్రేమ లేదనుకోకు. అదంతా కేవలం నటన అనుకోకు. యవ్వనంలో భర్తను దూరం చేసుకున్న అభాగ్యురాలు ఆమె. ఆమె వయసు ముప్పయ్‌కి కొంచెం ఎక్కువుంటుందేమో! ఈ వయసులో ఆమెకి మగతోడు అవసరం. ఆమెకి పెళ్లి చేయటానికి వీలవుతుందా?" అడిగాడు రత్నాకర్ రావు.

రాఘవయ్య తెల్లబోయాడు స్నేహితుడి విశ్లేషణకి.

"మా బంధువుల్లో కొంత మంది కమలని మళ్లీ పెళ్లి చేసుకోమని, పిల్లల్ని హాస్టల్లో వుంచి చదివిద్దామని ప్రపోజ్ చేసేరు. కానీ ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. ఇప్పుడిలా దిగజారింది..."

"అంటే తనకి మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదా?"



"లేదు. ఆ పక్కింటి సుందర్రావుది బీద కుటుంబం. ఆర్థిక ఇబ్బందుల వల్ల అతని అక్కచెల్లెళ్లకు పెళ్లిళ్లు జరగటం లేదు. అతనూ చేసుకోలేదు. ఎలా కమలని ముగ్గులోకి దించాడో నాకు బుర్ర పగలకొట్టుకున్నా అర్థం కావటం లేదు"

"నేను చెప్పేది నీకు నచ్చుతుందో లేదో నాకు తెలియదు. కానీ స్నేహితుడిగా నా అభిప్రాయం చెబుతున్నాను. కోరికలు చంపుకోవటం అందరి వల్లా కాదు. కమల దురదృష్టం కొద్దీ యవ్వనంలోనే భర్తను కోల్పోయింది. భర్త పోయినంత మాత్రాన కోరికలు చచ్చిపోవుగా? ఆమెకు పిల్లలంటే ప్రేమ. వారి భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని మళ్లీ పెళ్లి వద్దంది. కాబట్టి ఆమె ఆ సుందర్రావుతో లేచివెళ్లిపోయే ప్రయత్నం చెయ్యదు. అక్కచెల్లెళ్లకు పెళ్లి కానందున తాను పెళ్లి చేసుకోక బాధ్యతాయుతంగా వున్న సుందర్రావు కూడా కమలతో తన సంబంధాన్ని వెలుగులోకి తీసుకురాడు. నా అంచనా ప్రకారం వారి ఇద్దరి మధ్య వున్నది కేవలం వయసు వేడి! అది తాత్కాలికం. పవన్ బ్రతికుండగా కమల ఈ రకమైన తప్పు చేస్తే ఆమెకు ఎంత కఠినమైన శిక్ష వేసినా తక్కువే! కానీ ఇప్పుడు ఇలాంటి బలహీనతలను చూసీచూడనట్టు ఊరుకోవడమే మంచిది! కొంచెం పెద్దమనసు చేసుకో... నీకు పెళ్లయినా నువ్వు పంకజంతో ప్రేమాయణం కొనసాగించావు.. భర్త లేక, కోరికలు జయించలేక నీ కోడలు చేస్తున్నది తప్పే అయితే భార్య ఉండీ నువ్వు చేసిన తప్పు మరింత ఘోరమైనదేగా.. మగాడినని సమర్థించుకోకుండా ఆలోచించు" అన్నాడు రత్నాకర్ రావు.

రాఘవయ్య ఆలోచిస్తున్నాడు.

☆ ☆ ☆

అర్ధరాత్రి పెరటి తలుపు తీసిన చప్పుడుకు మెలకువ వచ్చింది రాఘవయ్యకు.

కొంచెం కదిలి మళ్లీ ప్రశాంతంగా నిద్రలోకి జారిపోయాడు.

ఆ తలుపు చప్పుడు ఇప్పుడతన్ని అశాంతికి గురి చెయ్యడం లేదు.

☆

## డ్రెస్సులదరహో!

ఇటీవల విడుదలైన 'రాజ్' సినిమాలో హీరోయిన్ కంగనా రనౌత్ 110 రకాల వెరయిటీ డ్రెస్సుల్ని ధరించి కనిపించిందిట. వీటి ఖరీదు ఎంతో తెలుసా? 75 లక్షల రూపాయలంటున్నారు ఆ సినిమా యూనిట్ వాళ్లు. ఓ చోటా చిత్రాన్ని ఈ డబ్బుతో తీసెయొచ్చు కదా! కేవలం ఒక్క చిత్రం కోసం హీరోయిన్‌కి ఇంత భారీ ఖర్చుతో డ్రెస్సులు ధరింపచేయడం అంటే రిస్కుతో కూడుకున్న పనే. ఈ డ్రెస్సుల బడ్జెట్‌ని సగానికి సగం తగ్గించుకున్నా నష్టం ఏమీ వుండదు. అయినా నిర్మాతలకు లేని బెంగ మనకెందుకు?